క్లుప్తంగా


29న అమలాపురంలో వాక్‌థాన్

అమలాపురం టౌన్: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీ ఉదయం అమలాపురంలో నడకతో అందరికీ ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా స్థానిక మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించనున్నట్లు మెడ్ యునైటెడ్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ కె.రవికిరణ్ వర్మలు తెలిపారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఉదయం 6.30 గంటలకు 216 జాతీయ రహదారిపై కాలేజీ రోడ్డులోని మెడ్ యునైటెడ్ ఆస్పత్రి వరకూ రెండున్నర కిలోమీటర్ల మేర కాలి నడకన ఈ వాక్‌థాన్ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో గుండె, వివిధ రకాల వ్యాధుల గురించి అవగాహన సదస్సు ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

28న గరికపాటి ప్రవచనం

అమలాపురం టౌన్: ఆనందు ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో అమలాపురం జానకీ రామర్స్ కళ్యాణ మండపంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రవచనకర్త, మహా సహస్రావధాని గరికిపాటి నరసింహరావు ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు అయ్యల సోమయాజుల బ్రహ్మానందం గురువారం తెలిపారు. హిందూ ధార్మిక బంధువులంతా ఈ ప్రవచన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అమలాపురం మున్సిపల్ ఆర్వోగా శ్రీలక్ష్మి



మున్సిపల్ ఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీలక్ష్మి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ రెవెన్యూ అధికారిణి(ఆర్వో)గా భూపతి శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపాలిటీ మేనేజర్‌గా పనిచేస్తూ శ్రీలక్ష్మి బదిలీపై ఇక్కడ ఆర్వోగా నియమితులయ్యారు. ఆమె 2022లో ఇదే మున్సిపాలిటీలో ఆర్వోగా పనిచేశారు. గతంలో పనిచేసిన అనుభవంతో మున్సిపాలిటీ ఆదాయాన్ని పన్నుల రూపంలో మరింత పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని శ్రీలక్ష్మి తెలిపారు.

ముగిసిన ఆటల పోటీలు



గొల్లవిల్లిలో ఖోఖో పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం: మండలంలో గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న నియోజవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఎంపిక పోటీలు గురువారంతో ముగిశాయి. అండర్–14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, యోగా, లాంగ్‌జంప్ తదితర క్రీడల్లో పోటీలు జరిగాయి. ఎంపికైన విద్యార్థులు కాకినాడలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీలు కామన మధు, గొలకోటి ఫణి, విఘ్నేశ్వరరావు, గణేశ్వరరావు తదితరులు తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



కూనవరం గ్రామంలో చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న గుడ్‌సీడ్ సభ్యులు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామానికి చెందిన వాకపల్లి సూరిబాబు కుమార్తె సత్య ఆదర్శ అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు చిన్నారి వైద్యం కోసం ఆమె తల్లిదండ్రులకు రూ.10 వేల చెక్కును గురువారం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన రమణారావుకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఊటాల రామాంజనేయులు, కాట్రు కృష్ణ, వాకపల్లి సురేష్ బాబు, గిడ్ల దుర్గాప్రసాద్, జాలెం సతీష్, బడుగు దొరబాబు, పొద్దోకు శ్రీధర్, పరమట రాజేష్, పోలినాటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ముమ్మిడివరం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అక్రమంగా నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యాన్ని ఆటోలో తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. అల్లవరానికి చెందిన గుండుపల్లి వీరబాబు ఆటోలో యానాం నుంచి 150 నిబ్బులు, మూడు ఫుల్ బాటిల్స్, నాలుగు బీర్ బాటిళ్లు తరలిస్తుండగా ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్ద పట్టుకున్నారు. ఆటో, మద్యాన్ని సీజ్ చేసి వీరబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రకృతి అందాలు.. సుందర దృశ్యాలు

- యానాంలో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగిస్తున్న పర్యాటక స్థలాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



గౌతమీగోదావరిలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు



ఫ్రెంచివారు నిర్మించిన రోమన్ కేథలిక్ చర్చి



యానాంలోని గౌతమి గోదావరి తీరంలో సుందర దృశ్యం



ఈఫిల్‌టవర్ నమూనాలో నిర్మించిన ఒబ్లిస్క్ టవర్

యానాం: ఉదయాన్నే లేవడం.. ఆఫీసుకు వెళ్లడం.. తిరిగి సాయంత్రం ఇంటికి రావడం.. ఇదే దాదాపు అందరి జీవితాల్లో ఉండే దినచర్య. రోజువారీ బిజీ లైఫ్ నుంచి కాస్త ప్రశాంతత కోసం చాలామంది పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు ఇష్టపడుతుంటారు. కొత్త ప్రదేశాలను చూడటం, కొత్తవారిని కలవడం, ప్రయాణించడం, జ్ఞాపకాలను పోగేసుకోవడం లాంటివి చేయడమంటే ఎవరికైనా మంచి అనుభూతులను కలిగిస్తుంది. అలాంటివారికి యానాం ఫ్రెంచ్, తెలుగు సంస్కృతుల మేళవింపుతో ఆహ్వానం పలుకుతోంది. ప్రకృతి అందాలు, సుందర దృశ్యాలతో పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది. సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

చారిత్రక పట్టణం యానాం

ఒకప్పటి ఫ్రెంచివారు పాలించిన ప్రాంతంగానే కాకుండా కేంద్రపాలిత ప్రాంతంగా యానాం జిల్లా వాసులకు అందరికీ సుపరిచితమే. ఈ నియోజకవర్గ పరిధిలో పలు పర్యాటక కట్టడాలు పర్యాటకులకు మధురానుభూతిని మిగులుస్తాయి. ముఖ్యంగా యానాం పట్టణంలోనే గాకుండా నియోజకవర్గ శివారు ప్రాంతాల్లో సైతం అనేక పర్యాటక ప్రాజెక్టులు నిర్మిస్తూ అందరినీ ఆకట్టుకుంటుంది. దీంతో నిత్యం పలువురు పర్యాటకులు యానాం పట్టణాన్ని సందర్శిస్తూ ఉంటారు. పర్యాటక పరంగానే కాకుండా చారిత్రక పట్టణంగా యానాం పేరొందింది.

ఎన్నెన్నో అందాలు

- గౌతమి గోదావరికి మణిహారంగా రాజీవ్ రివర్ బీచ్ అందరినీ ఆహ్లాదపరుస్తుంది. అంతేగాకుండా రాజీవ్ బీచ్‌కు శివారున బాలయోగి వారధికి ఆనుకుని బ్రెజిల్‌లోని రియో డిజెనీరోలో కోర్‌కోవడో శిఖరంపై నిర్మించిన రీతిలో మానవాళి శాంతిని కాంక్షిస్తున్నట్లు నిర్మించిన జీసెస్ విగ్రహం అందరినీ ఆకట్టుకుంటుంది.
- గౌతమి తీరంలోని రాజీవ్ బీచ్ ముఖద్వారంలో రెండు ఏనుగులు శివలింగానికి అభిషేకం చేస్తున్నట్లు నిర్మించిన శివమ్‌బాత్ అందరినీ ఆహ్లాదపరుస్తుంది. ఫ్రాన్స్ రాజధానిలోని ఈఫిల్ టవర్ నమూనాలో యానాం శివారు గ్రామం గిరియాంపేటలో ఓబ్లిస్క్ టవర్ నిర్మించారు. దీని పైనుంచి చూస్తే సముద్రతీరం, ఎదురుగా రిలయన్స్ కంపెనీ తదితరమైనవి కనువిందు చేస్తాయి.
- మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద పచ్చదనం పరిచినట్లు నిర్మించిన బొటానికల్ గార్డెన్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. అందులోని జాతిపిత మహాత్మాగాంధీ కాంస్య విగ్రహం అతిపెద్దది.
- ఫ్రెంచివారి వారసత్వ కట్టడాలకు చిహ్నంగా నిలిచేలా 18వ శతాబ్దంలో నిర్మించిన అతిపెద్ద రోమన్ కాథలిక్ చర్చి పర్యాటకులను ఆకట్టుకుంటుంది.
- అంబేడ్కర్ నగర్‌లోని బుద్ధాపార్క్, పట్టణ నడిబొడ్డున ఉన్న చిల్డ్రన్స్‌పార్క్, బాలయోగి స్టేడియం, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం, ఫ్రెంచి వారి నుంచి స్వాతంత్ర్యం పోరాటానికి చిహ్నంగా మన్యంవారి భవనం తదితరమైనవి పర్యాటకులు తప్పనిసరిగా సందర్శిస్తుంటారు.

డీఎస్పీని కలిసిన దళిత ఐక్య వేదిక నాయకులు



డీఎస్పీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న జిల్లా దళిత వేదిక నాయకులు

అమలాపురం టౌన్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను జిల్లా దళిత ఐక్య వేదిక నాయకుల బృందం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసింది. దళిత ఐక్య వేదిక కార్యకలాపాలకు పోలీసు శాఖ సహకారాన్ని ఆ వేదిక నాయకులు డీఎస్పీని కోరారు. వేదిక జిల్లా కన్వీనర్ జంగా బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు ఆధ్వర్యంలో దళిత నాయకులు డీఎస్పీని కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్య వేదిక ప్రతినిధులు మెండు సురేష్‌బాబు, ముత్తాబత్తుల సత్యనారాయణ, దేవరపల్లి శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యపై దృష్టి పెట్టాలి



మున్సిపల్ కమిషనర్ రాజును సత్కరిస్తున్న ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో కొన్నేళ్లుగా ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్‌ను ప్రక్షాళన చేసి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుకు ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. ఇటీవల కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజును ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. పట్టణాభివృద్ధికి చేసే ప్రయత్నంలో ఆజాద్ ఫౌండేషన్ సహకారం కూడా ఉండాలని కమిషనర్ రాజు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధాకొండ, అడ్డాల గోపాలకృష్ణ, నిమ్మకాయల సుబ్బారావు, కొత్తపల్లి వంశీ, అడబాల బుజ్జి, ఆకెళ్ల బుజ్జి, నామన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపునీటిని తొలగించండి మహాప్రభో



సుంకరపాలెం జంక్షన్ వద్ద ముంపునీటిలో ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక వ్యాపారులు

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రోజూ ఏదో సమయంలో కుండపోత వర్షం కురుస్తుండడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో సైతం నీరు నిలిచిపోతుండడంతో స్థానికులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని సుంకరపాలెం జంక్షన్‌లో భారీ వర్షం కారణంగా నీరు నిలిచిపోయి వ్యాపార దుకాణాల వద్దకు జనం రాకపోవడంతో స్థానిక వ్యాపారులంతా ఆందోళన నిర్వహించారు. రోజుల తరబడి నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోందని వర్తక సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ముంపునీటిని తొలగించండి మహాప్రభో అని అధికారులను అధికారులను వేడుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్యానికి సోపానాలు

అమలాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు లబ్ధిదారుల ఆరోగ్యానికి సోపానాలుగా నిలుస్తున్నాయని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకుని అమలాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లలో పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. ఐరన్, కాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవాలని వాటి ద్వారా రక్తహీనత నివారించవచ్చని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో విజయకుమారి, ఎంపీటీసీలు వాసంశెట్టి శ్రీనివాస్, దొంగ ఆంజనేయులు, ఉడుము రామకృష్ణ, సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.మహేశ్వరి, కె.లీలాకుమారి, సీహెచ్ వెంకటలక్ష్మి, ఉన్నీషా, ఎం.రమాదేవి, ఎస్.కుమారి, ఏపీవో శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ వినతి



యానాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

యానాం: ఎస్సీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సావిత్రినగర్‌కు చెందిన మల్లాడి రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ సీఐ షణ్ముగంకు వివిధ గ్రామాల దళిత నేతలు గురువారం వినతి పత్రం అందజేశారు. మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు పదవులు ఇవ్వడం వల్లే నియోజకవర్గ ఎస్సీలు తలెత్తుకుని తిరుగుతున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్ల వల్లే తమకు పదవులు దక్కుతున్నాయన్నారు. అదేవిధంగా పీసీఎస్ఆర్ సెల్‌లో సైతం తాము ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌నగర్, దరియాలతిప్ప, పరంపేట తదితర గ్రామాల పెద్దలు పండు సిద్దార్థ, మెల్లం శ్రీను, మోకా బుజ్జి, సబ్బతి లోకేశ్వరరావు, సబ్బతి శ్రీనివాసరావు, దుగ్గుదుర్తి మనోజ్, కొరమాటి జార్జి పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి



ముమ్మిడివరంలో ఈవీఎం, వీవీప్యాట్ల గోదాములను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తులో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచిన గోదాములను కలెక్టర్ మహేష్‌కుమార్ సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న అన్ని చర్యలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి త్రైమాసికానికి సంబంధించి ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల తరపున ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వడ్డి నాగేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీ వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ముమ్మిడివరం తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఆర్ఐ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 27న జూనియర్ ఇంజినీర్ పరీక్ష

యానాం: పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ) శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీర్(సివిల్) ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 27న పోటీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీపీఅండ్ఏఆర్ అండర్ సెక్రటరీ వి.జయశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పేపర్–1 పరీక్ష , మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకూ పేపర్–2 పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థుల హాల్‌టికెట్లను త్వరలోనే జారీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు, అప్‌డేట్‌ల కోసం 'రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్'వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

రవాణా శాఖాధికారిని కలిసిన లారీ ఓనర్స్ ఉపాధ్యక్షుడు



రవాణా శాఖాధికారి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న స్వామినాయుడు

అమలాపురం రూరల్: జిల్లా రవాణా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన దేవిశెట్టి శ్రీనివాస్‌ను లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకపల్లి స్వామినాయుడు గురువారం అమలాపురంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖాధికారి శ్రీనివాస్‌కు స్వామినాయుడు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాలో లారీ యూనియన్ల సమస్యలను ఆయనకు వివరించారు.

స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

యానాం: ఉద్యోగులు తమ విధులు నిర్వహించుకుంటూనే స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావొచ్చని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గాజులగార్డెన్స్‌లో యానాం కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావొచ్చని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను కాపు ఉద్యోగుల సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాజుల బాబి, హంసాని రామలక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల దాతృత్వం అభినందనీయం



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి విద్యార్థులు ముందుకొచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన పోలిశెట్టి లక్ష్మీ పార్వతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.50,000 చెక్కును కలెక్టర్ మహేష్‌కుమార్‌కు గురువారం రాత్రి కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో డీవైఈవో సూర్యప్రకాశం, స్కూల్ హెచ్ఎం ఎ.శేషసాయి, స్కూల్ చైర్మన్ పోలిశెట్టి వెంకటరాజు, వైస్ చైర్మన్ వర్మ, చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్, వైస్ సర్పంచ్ బీవీ నారాయణ, ఎంపీటీసీ గుత్తుల మహాలక్ష్మి, వార్డ్ మెంబర్ కాయల బలరాం తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలందించారు



ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్, కార్యాలయ సిబ్బందిని సత్కరిస్తున్న దస్తావేజు లేఖర్లు

ముమ్మిడివరం: ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్.రాంబాబు విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలు అందించారని దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు కొనియాడారు. రాంబాబు బదిలీపై రాజమహేంద్రవరానికి వెళుతున్న సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా సీనియర్ అసిస్టెంట్ వారా అరుణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ దండు సత్యకళ, ద్రోణవజ్జల బాలాత్రిపురసుందరి, షేక్ సత్తార్‌లను దుశ్శాలువాలు, పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో చవటపల్లి వెంకటేశ్వరరావు, తాడాల వీరబాబు, సలాది చిట్టిబాబు, గోపాలకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఎల్‌ఓ ఆకస్మిక తనిఖీలు



ఇందుపల్లిలో పాఠశాలను తనిఖీ చేస్తున్న ఏఎస్‌ఎల్‌ఓ రమేష్‌బాబు

అమలాపురం రూరల్: సర్వ శిక్ష అభియాన్ జిల్లా ఏఎస్‌ఎల్‌ఓ రమేష్‌బాబు అమలాపురం మండలంలోని ఇందుపల్లి ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను పరిశీలించి విద్యా ప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల గురించి ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలు

అల్లవరం: ఓడలరేవు బీచ్ రోడ్డులోని ఆక్వా చెరువుల సమీపంలో ఏర్పాటుచేసిన విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చేలరేగాయి. దీంతో స్థానికులు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వ్యాపించకుండా విద్యుత్‌ను నిలిపివేసి అధికారులకు సమాచారం అందించారు. అనంతరం మంటలను అదుపుచేశారు. దీంతో స్థానికులు, ఆక్వా రైతులు ఊపిరి పీల్చుకున్నారు.